పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేయిస్తా: ఎమ్మెల్యే


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పేట్‌బషీరాబాద్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని వివిధ కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన వివిధ కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు ఆయనను శనివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో నెలకొన్న సమస్యలు, అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు వివరించారు.

నాలా పూడికతీత పనుల పరిశీలన


బాలానగర్‌లో చేపడుతున్న నాలా పూడికతీత పనులు

బాలానగర్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా నాలాల్లో పూడికతతీత పనులను సక్రమంగా చేపట్టాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు. శనివారం డివిజన్ పరిధి కల్యాణ్‌నగర్ నుంచి బోజై ఫంక్షన్ హాల్ వరకు చేపట్టిన పూడికతీత పనులను డివిజన్ ఏఈ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములుతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఆర్‌ఐటీలో ఫోరమ్ ప్రాంతీయ సదస్సు

దుండిగల్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ 23-24 పేరుతో ఫోరమ్ ప్రాంతీయ సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతీయ ఫోరం సమకాలిన సవాళ్లకు వినూత్న పరిష్కారాలను అన్వేషించి, చర్చించడానికి ఇంజనీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమల నిపుణులకు ఒక చోట చేరి చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. వాటిలోంచి అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి రూ.15 వేల నగదు బహుమతులను అందించారు.

టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌తో మెరుగైన విద్యుత్ సేవలు

పేట్‌బషీరాబాద్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ విద్యుత్ డివిజన్ పరిధిలో టీజీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలను అందించొచ్చని డివిజన్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్ ద్వారా విద్యుత్ సరఫరా విభాగంలో వినియోగిస్తున్న సాంకేతిక వ్యవస్థ, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్‌లు, పరికరాలు ఏ విధంగా పని చేస్తున్నాయి, లోపాలను ఈ యాప్ ద్వారా రికార్డు చేసి సరిదిద్దొచ్చని తెలిపారు. ఈనెల 24 నుంచి విద్యుత్ సిబ్బంది వినియోగదారుల నుంచి ఈ యాప్ ద్వారా సమస్యలు స్వీకరిస్తారని అధికారులు కోరుతున్నారు.

ఇరుకుగా రావినారాయణరెడ్డినగర్ రోడ్డు


ఇరుకైన రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనదారులు

గాజులరామారం, జూన్ 22(ఆంధ్రజ్యోతి): వాహనాల రాకపోకలు పెరగడం, రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర అవస్థలు పడడంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు. గాజులరామారం డివిజన్‌లోని రావినారాయణరెడ్డినగర్ నుంచి దేవేందర్‌నగర్‌కు వెళ్లే రోడ్డు చాలా ఇరుకుగా ఉంది. వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు మూలమలుపులు ఎక్కువగా ఉండడం, భారీ వాహనాలు సైతం వెళ్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డులో ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుకుంటున్నారు.

అక్రమాలను ప్రోత్సహిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు


ఫిర్యాదు కాపీనిచూపుతున్న సునీల్‌యాదవ్

కూకట్‌పల్లి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మూసాపేట, కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలోని టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమాలను ప్రోత్సహిస్తూ డబ్బు దండుకొంటున్నారంటూ కాంగ్రెస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జిట్టా సునీల్‌యాదవ్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ స్నేహశబరీష్‌కు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ ప్రాంతాల్లో అనుమతులకు మించి అంతస్తులు నిర్మిస్తున్నారని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. అక్రమ సంపాదనకు అలవాటుపడి ప్రజాసమస్యలను గాలికొదిలేశారని ఆరోపించారు. అలాంటి అధికారులపై విచారణ జరిపించాలని ఆయన కోరారు.


డబుల్‌బెడ్‌రూంలను పరిశీలిస్తున్న బండి రమేష్, నాయకులు

జేఎన్ఎన్‌యూఆర్‌ఎంలో సమస్యలు పరిష్కరిస్తా

కూకట్‌పల్లి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఖైతలాపూర్ సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్‌ఎం గృహసముదాయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన శనివారం పర్యటించారు. జేఎన్ఎన్‌యూఆర్‌ఎంలో రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యలతోపాటు అపార్ట్‌మెంట్స్‌కు లిఫ్ట్ సదుపాయం లేకపోవడం వంటి సమస్యలను గుర్తించారు. అనంతరం నిర్మాణం పూర్తిచేసుకొన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, లక్ష్మణ్, శేరి సతీష్‌రెడ్డి, కృష్ణరాజ్‌పుత్, సతీష్‌గౌడ్, జి.వెంకటేశ్వరరావు, రాఘవేంద్ర, అరవింద్‌రెడ్డి, శివచౌదరి పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీపురంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో బండి రమేష్ పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తా


నేతాజీ కాలనీవాసులతో మాట్లాడుతున్న సతీష్‌గౌడ్

ఫతేనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లోని పలు బస్తీలలో తలెత్తుతున్న కలుషిత నీటి సమస్యను పరిష్కరించేందుకు జలమండలి అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధి నేతాజీకాలనీ జాన్సన్ గ్రామర్ స్కూల్ వీధిలో కొన్ని రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఇచ్చిన సమాచారంతో కార్పొరేటర్ నేతాజీకాలనీవాసులతో కలిసి పర్యటించి నీటి సమస్యపై ఆరాతీశారు. సమస్యను జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్‌కు వివరించి సమస్యను త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో నేతాజీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వెంకటరాంనర్సయ్య, స్వామి, శేఖర్, సురేందర్ నాయకుడు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుంది'

బాలానగర్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిషలు శ్రమించి పని చేసిన ప్రతీ కార్యకర్తకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు హామీ ఇచ్చారు. బాలానగర్ బీజేపీ కార్యకర్త యాదగిరి భార్య అనారోగ్యంతో ఈనెల 20 మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన కార్యకర్త ఇంటికి వెళ్లి యాదగిరిని, ఆయన కుటుంబసభ్యులను శనివారం పరామర్శించారు. బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మన్ డివిజన్ నాయకులు సమంత్ బస్వరాజ్ వడ్డేపల్లి వెంట ఉన్నారు.

చదువు కోసం బెంగళూరుకు వెళ్లి..

డ్రగ్స్ స్మగ్లర్‌గా మారిన యువకుడు

- ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా పార్శిల్స్
- రెండు తెలుగు రాష్ట్రాలకు సరఫరా
- నిఘాపెట్టి పట్టుకున్న టీన్యాబ్, మాదాపూర్ పోలీసులు
- స్మగ్లర్ సహా.. నలుగురు వినియోగదారులు అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం బెంగళూరుకు వెళ్లిన యువకుడు.. అక్కడ డ్రగ్స్‌కు అలవాటుపడి దానినే వ్యాపారంగా మార్చుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లో కస్టమర్స్‌కు సరఫరా చేస్తున్నాడు. డ్రగ్స్ స్మగ్లర్‌ను, మరో నలుగురు వినియోగదారులను తెలంగాణ నార్కోటిక్ బ్యూరో, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా శనివారం పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.50 లక్షల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుకు చెందిన వెంకట సాయిచరణ్ గ్రాడ్యుయేషన్ చదువు కోసం బెంగళూరుకు వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డాడు. చదువు పూర్తయిన తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఉన్న తన స్నేహితుల ద్వారా కొంతమంది డ్రగ్స్ వినియోగదారులను ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, వైజాగ్, హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని కస్టమర్స్‌కు ఎండీఎంఏ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నాడు. బెంగళూరు నుంచి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్లకు పార్శిల్ కవర్లలో ఇచ్చి డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నాడు. ఇటీవల నగరంలో మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్న నార్కోటిక్ బ్యూరో పోలీసులు డ్రగ్స్ స్మగ్లర్స్, వినియోగదారులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో సాయిచరణ్ సైబరాబాద్ పరిధిలోని మాదాపూర్‌లో కస్టమర్స్‌కు డ్రగ్స్ సప్లై చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో మాదాపూర్, నార్కోటిక్ బ్యూరో పోలీసులు సంయుక్తంగా దాడిచేసి సాయిచరణ్‌తో పాటు.. నలుగురు వినియోగదారులు మల్లిక్‌లోకేష్, సందీప్‌రెడ్డి, రాహుల్, సుబ్రమణ్యంలను అదుపులోకి తీసుకున్నారు.


అభిమానుల సమక్షంలో కేకును కట్ చేస్తున్న కృష్ణగౌడ్

మాజీ కార్పొరేటర్ కృష్ణగౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ

ఫతేనగర్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, బీజేపీ స్టేట్ ఓబీసీ మోర్చా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ముద్దాపురం కృష్ణగౌడ్ జన్మదినం శుక్రవారం రాత్రి ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చిన కృష్ణగౌడ్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.


పోలీసులతో కలిసి భాగ్యనగర్‌కాలనీలో పర్యటిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

భాగ్యనగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

హైదర్‌నగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్‌కాలనీ అసోసియేషన్ సభ్యులతో కాలనీలో ఉన్న పార్కులు, పార్కింగ్, మౌలిక వసతులపై సమావేశం నిర్వహించారు. భాగ్యనగర్‌కాలనీ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సమస్యలు, ట్రాఫిక్ వల్ల ఎదురువుతున్న ఇబ్బందులను కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ ఇతర అధికారులతో కలిసి అసోసియేషన్ సభ్యులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించి ప్రజలకు మంచి జరిగేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు భానుప్రసాద్, జానకిరామరాజు, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కూన సత్యంగౌడ్, ప్రసాద్, శ్రీనివాస్‌రావు, కాలనీ అధ్యక్షుడు దాస్, వేణుగోపాల్, సైదేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రజలే నా వీఐపీలు

అభినందన సభలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

నిజాంపేట్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): 'నేను పిలిస్తే పలికే ఎంపీగా ఉంటా, ప్రజలే నా వీఐపీలు. ఎంత ఎక్కువ మంది నా దగ్గరకు వస్తే.. అంత సంతోషిస్తా' అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం, నిజాంపేట్ కార్పొరేషన్, ప్రగతినగర్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొని ప్రసంగించారు. తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ నాయకుడికి, కార్యకర్తకి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీకి ఎమ్మెల్యే ఎన్నికల్లో తక్కువ ఓట్లు వచ్చాయని బయటపడ్డానని, అనేక మంది అజ్ఞాత సూర్యులు కష్టపడి పని చేశారన్నారు. ఇతర పార్టీ నాయకులు కూడా తన గెలుపు కోసం కృషి చేసినట్లు ఆయన చెప్పారు. నమ్మకం, విశ్వాసం ఉంచి నందుకు తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రగతినగర్ చెరువు నిండా గుర్రపు డెక్క నిండిపోయి దోమలు పెరిగాయని, ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తానని తెలిపారు. వైద్య, విద్య, ట్రాఫిక్, ముంపు సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, వాటిని పరిష్కరించడడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈటలకు రెండే తెలుసు.. అవసరమైతే సమస్యలపై ఫైట్ చెయ్యడం, అధికారం ఉంటే పరిష్కారం చెయ్యడం. అని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మల్లారెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్, గిరివర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి, డాక్టర్ ఎంఆర్‌ఎస్ రాజు, శేఖర్, నాగరాజు, చంద్రమౌళి, ఆంజనేయులు, భిక్షపతి, కృష్ణ, సుబ్బారావు, చక్రవర్తి, నర్సింహ, ఎంఆర్పీఎస్ నాయకలు సంజీవరావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో ఈటల రాజేందర్‌కు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.


ఈటలకు దేవుడి చిత్రపటాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

● ఈటలను కలిసిన నేతలు

ఫతేనగర్: ఫతేనగర్ డివిజన్ నాయకులు బూర్గుల రామ్మోహన్, భిక్షపతి, భిక్షపతిగౌడ్, తులసీరామ్ శనివారం ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

హెచ్‌సీఏ ఓపెన్ సెలెక్షన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉమెన్స్ లీగ్ కోసం వర్ధమాన మహిళా క్రికెటర్లను ఎంపిక చేసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఓపెన్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం కార్యదర్శి ఆర్.దేవ్‌రాజ్ వెల్లడించారు. ఈనెల 29, 30 తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప్పల్ స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రికెటర్లు సోమవారం నుంచి www.hycricket.in వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదుచేసుకోవాలని చెప్పారు. గతంలో బీసీసీఐ టోర్నమెంట్స్, హైదరాబాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్న వారు, తెలంగాణ పౌరులు కాని వారు ఈ సెలెక్షన్స్‌లో పాల్గొనడానికి అనర్హులు అని దేవ్‌రాజ్ తెలిపారు.


నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మైనర్‌పై యువకుడి లైంగికదాడి

హిమాయత్‌నగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మైనర్‌పై లైంగికదాడికి పాల్పడిన యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం నారాయణగూడ పీఎస్‌లో మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, ఎస్సై షఫీతో కలిసి సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ కేసుకు వివరాలను వెల్లడించారు. సైఫాబాద్‌కు చెందిన మైనర్ (16) నారాయణగూడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ ఖలీల్(22) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండేళ్లుగా ప్రేమిస్తున్నానని బాలికను వేధిస్తున్నాడు. ఇటీవల బాలిక కళాశాలకు సరిగా రాకపోతుండడంతో యాజమాన్యం ఆమె తండ్రికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చింది. దీంతో బాలిక ఆచూకీ ఎంతకీ తెలియక పోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నాంపల్లి రైల్వేస్టేషన్‌లో బాలికను గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసులను చూసిన సయ్యద్‌ఖలీల్ పారిపోయాడు. బాలికను భరోసా సెంటర్‌కు తరలించి వాంగ్మూలం నమోదు చేశారు. ఆమెను ఓయోకు తీసుకెళ్లిన సయ్యద్‌ఖలీల్ తనపై లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆదిలాబాద్‌లో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీకి అనుమతి నిరాకరణ

కోస్గి ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీకి జేఎన్‌టీయూ ఓకే..

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు సంబంధించిన ఫైలు అటకెక్కినట్లేనా? అంటే అవుననే అంటున్నారు యూనివర్సిటీ ఉన్నతాధికారులు. ఈ ఏడాది కొత్తగా ప్రారంభమయ్యే కళాశాలల జాబితాలో ఆదిలాబాద్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ లేదని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం, మహబూబాబాద్, అదిలాబాద్ జిల్లాల్లో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీలను మంజూరు చేస్తూ అప్పటి విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో గత విద్యా సంవత్సరంలోనే ఖమ్మం జిల్లా పాలేరులో, మహబూబాబాద్ పట్టణంలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీలను ప్రారంభించారు. అదిలాబాద్ జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచి జేఎన్‌టీయూ కాలేజీని ప్రారంభించాలని ప్రభుత్వ పెద్దలు, వర్సిటీ ఉన్నతాధికారులు భావించారు. అయితే ప్రభుత్వం మారడంతో ప్రాధాన్యాలు మారాయని.. దీంతో ఈ కాలేజీ ఫైలును వర్సిటీ అధికారులు అటకెక్కించినట్టు తెలుస్తోంది. కాగా కొత్త ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కోస్గి ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేందుకు అవసరమైన అఫిలియేషన్/అనుమతులను జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు మంజూరు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో ఈ కాలేజీ ప్రారంభమవుతోంది. ఇందుకు జేఎన్‌టీయూ నుంచి అవసరమైన అనుమతులు లభించాయి. ఈ కాలేజీలో మూడు కోర్సులను ప్రవేశపెడుతుండగా అవి కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సులే కావడం విశేషం. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్‌లెర్నింగ్ (ఏఐఎంఎల్), డేటాసైన్స్(డీఎస్) కోర్సులకు జేఎన్‌టీయూ అనుమతులిచ్చింది. ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున 180 మందికి అడ్మిషన్లు లభించనున్నాయి. మరోవైపు పాలేరు జేఎన్‌టీయూ, మహబూబాబాద్ కాలేజీల్లో ఈ ఏడాది మరో రెండు కోర్సులను ప్రారంభించేందుకు అధికారులు సాంకేతిక విద్యాశాఖకు లేఖ రాశారు.

27 నుంచి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడాపాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం తెలిపారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈనెల 27 నుంచి 30 వరకు ఉదయం 8 గంటల నుంచి ఎంపిక పోటీలుంటాయని చెప్పారు. 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, 6-10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్స్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, కిలో మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగు, బరువు, ఎత్తు, మెడికల్ టెస్టులుంటాయన్నారు. హైదరాబాద్ జిల్లాలో మండల స్థాయి ఎంపికలు ఈనెల 24, 25 తేదీల్లో జరుగుతాయని, జిల్లా స్థాయి ఎంపికలు 27 నుంచి 30 వరకు నిర్వహిస్తామన్నారు. అలాగే రాష్ట్రస్థాయి ఎంపికలు జులై 8 నుంచి 12 వరకు హకీంపేటలో ఉంటాయని చెప్పారు. ప్రవేశ పోటీలకు హాజరయ్యే బాలబాలికలు 1.9.2015 నుంచి 31.08.2016 మధ్య పుట్టిన వారై ఉండాలని, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని వివరించారు. వివరాలకు 040-27900649లో సంప్రదించాలని సూచించారు.

చందానగర్‌లో మృతదేహం స్వాధీనం



చందానగర్, జూన్22 (ఆంధ్రజ్యోతి): చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హుడాకాలనీ సాయిబాబా దేవాలయం సమీపంలోని స్థలంలో సుమారు 45 సంవత్సరాలు వయసున్న గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు స్థానికులు 108 సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా అప్పటికే మహిళ మృతి చెందినట్లు చందానగర్ పోలీసలకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఎవరైనా గుర్తుపడితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఖైరతాబాద్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి మద్యంమత్తులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఖైరతాబాద్, మారుతీనగర్‌కు చెందిన హరిఅరవింద్‌రావు (34) ప్రైవేట్ ఉద్యోగి. ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదే ఇంట్లో పై అంతస్తులో ఉండే సోదరుడు గమనించి కిందికి దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు తెలిపారు. అన్ని కోణాల్లో విచారిస్తున్నామని ఖైరతాబాద్ ఎస్‌ఐ శ్రీరాములు తెలిపారు.

ఉద్యాన పాలిటెక్నిక్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజేంద్రనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో రెండేళ్ల ఉద్యాన డిప్లొమా కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉద్యాన పాలిటెక్నికల్‌లో 200 సీట్లు ఉండగా, ఆదిలాబాద్, రమగిరి కిల్లా, కొల్లాపూర్ పాలిటెక్నిక్ ఉద్యాన కాలేజీలో 40 చొప్పున ఇన్‌టెక్ కెపాసిటీ ఉందని వర్సిటీ అధికారవర్గాలు తెలిపాయి. మరో రెండు అఫిలేటెడ్ పాలిటెక్నిక్‌లు గడ్డిపల్లిలో గల గంటా గోపాల్‌రెడ్డి ఉద్యాన పాలిటెక్నిక్, మహబూబాబాద్‌లోని తొర్రూర్‌లో గల విశ్వధార హార్టికల్చర్ పాలిటెక్నిక్‌లో కూడా 40 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 15 నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నారని, జూలై 15వ తేదీ వరకూ అందజేయవచ్చన్నారు. పాలిసెట్ 2024 లేదా టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణత, ఇంటర్ ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 2024 డిసెంబర్ 31 నాటికి కనీసం 15 సంవత్సరాలు, గరిష్ఠంగా 22 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. 60 శాతం సీట్లు గ్రామీణప్రాంతాల్లో కనీసం నాలుగు సంవత్సరాలు చదివిన విద్యార్థులకు కేటాయిస్తారని తెలిపారు.

● మోజర్ల ఉద్యాన కళాశాలలో డిప్లొమా

వనపర్తి జిల్లా మోజర్లలోని ఉద్యాన కళాశాలలో, కొల్లాపూర్ ఉద్యాన పాలిటెక్నిక్‌లో డిప్లొమా చేయొచ్చని అధికారులు తెలిపారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట్ జిల్లాల విద్యార్థులకు ఇక్కడి ప్రాంగణం దగ్గరగా ఉంటుందని పాలిటెక్నిక్ వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిగెం సైదయ్య తెలిపారు. నేరుగా బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో హార్టీ సెట్ ద్వారా సీటు సంపాదించవచ్చు. ఇతర వివరాల కోసం హెల్ప్ డెస్క్ నెంబర్ 9652456779లో సంప్రదించాలని లేదా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు


సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని సాయిఐశ్వర్య కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీవాసులతో కలిసి ఆ యా ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు.

న్యూకాలనీ సమస్యలపై కార్పొరేటర్ సమీక్ష

మియాపూర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూకాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ అధికారులతో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. న్యూకాలనీ సమస్యల పరిష్కారానికి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ప్రతీ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ రాజు, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ డీజీఎం నాగప్రియ, మేనేజర్ సునీత, ఏఈ దుర్గాప్రసాద్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు నవీన్, లింగయ్య, ఎస్‌ఆర్పీ కనకరాజు, మహేష్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, కెఎస్ఎన్ రాజు, లావణ్య, వరలక్ష్మి, తిమ్మరాజు, నరేష్‌నాయక్, వెంకటేష్‌గౌడ్, జూపల్లి శంకర్, రాజు, రాజేష్, శ్రీశైలం, రవి, అశోక్, జ్యోతి, లక్ష్మి, మహేష్, సత్యనారాయణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


న్యూకాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

చాంద్రాయణగుట్ట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో వివాహేతర సంబంధం యువకుడి హత్యకు దారితీసింది. బాబాకాంట సొహైబ్‌కాలనీకి చెందిన జాకిర్‌అలీ(29)కి ఐదు సంవత్సరాలుగా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల ఆ మహిళ తనను మరిచిపోవాలని అనేకసార్లు చెప్పినా జాకిర్‌అలీ వేధించసాగాడు. ఈ విషయాన్ని మహిళ తన సోదరుడికి చెప్పింది. అతను కూడా జాకిర్‌అలీని పలుమార్లు హెచ్చరించాడు. అయినా అతడిలో మారలేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మహిళ ఇంటికి జాకిర్‌అలీ వచ్చాడు. విషయం తెలుసుకుని సోదరుడు కూడా అక్కడికి రావడంతో ఇద్దరి మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన ఆమె సోదరుడు జాకిర్‌అలీ తలపై ఐరన్‌రాడ్‌తో కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు జాకిర్‌అలీ మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

సైబర్ నేరగాళ్లు.. రూ.32.68 లక్షల చోరీ

హైదరాబాద్‌సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు.. రూ.32.68 లక్షల చోరీ చేశారు. ఇరాన్‌కు పంపిన పార్శిల్‌పై ఉన్న వివరాలు మనీ లాండరింగ్ కేసుల్లో నమోదై ఉన్నాయని నగరానికి చెందిన మహిళను భయపెట్టి, ఆమె ఖాతా నుంచి రూ.15.76 లక్షలను, గూగుల్ మ్యాప్‌కు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని నగరవాసిని నమ్మించి, అతని ఖాతా నుంచి రూ.16.68 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన మహిళకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ప్రముఖ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పిన వ్యక్తి 'మీ పేరుతో ఇరాన్‌కు పంపిన కొరియర్ తిరిగి వచ్చింది. నీకు పార్శిల్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. ఈ విషయంపై సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి' సూచించి, మరో వ్యక్తికి కనెక్ట్ చేశాడు. స్కైప్ కాల్ చేసిన నిందితుడు 'మీ ఆధార్‌కు లింక్ అయిన బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు అక్రమంగా డబ్బు తరలి వెళ్లింది. మీ ఆధార్‌పై ముంబై అంధేరి పోలీస్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి' అని పత్రాలు చూపాడు. ఈ కేసులకు తనకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పగా, 'మీ బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వాలి' అని సూచించాడు. 'మీ ఖాతాలో డబ్బులు ఆర్‌బీఐ అకౌంట్‌కు బదిలీ చేయాలి. 30 నిమిషాల్లో వెరిఫికేషన్ పూర్తి చేసి, మీ డబ్బు తిరిగి మీ ఖాతాలో జమ చేస్తారు' అని చెప్పాడు. ఇలా చేయని పక్షంలో మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్ అవుతారని బెదిరించాడు. నమ్మిన మహిళ తన ఖాతాలో ఉన్న రూ.15.76 లక్షలను అతడు సూచించిన ఖాతాకు బదిలీ చేసింది. తర్వాత మోసపోయానని గ్రహించిన మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గూగుల్ మ్యాప్ రేటింగ్ పేరుతో..

రూ.16.68 లక్షలకు టోకరా

గూగుల్ మ్యాప్‌కు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.16.68 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన వ్యక్తికి వాట్సప్‌కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు గూగుల్ మ్యాప్‌కు రేటింగ్స్ ఇస్తే డబ్బులు ఇస్తామని నమ్మించారు. ముందుగా కొద్ది మొత్తం ఖాతాలో జమ చేశారు. మరింత డబ్బు కావాలంటే కొంత మొత్తం రీఫండబుల్ డిపాజిట్ చేయాలని సూచించారు. వారి మాటలు నమ్మిన వ్యక్తి రూ.16.68 లక్షలు వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేశాడు. తర్వాత నుంచి ఫోన్‌లు స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.